క్లుప్తంగా

రసాయనిక ఎరువులతో నష్టం



మల్దకల్: రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ ,అధికారి రాజశేఖర్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని చర్లగార్లపాడులో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటకు తెగులు సోకడంలో ఏఓ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. సేంద్రియ ఎరువులను వాడటం ద్వారా మంచి దిగుబడులను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతులు ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ సాధించే వరకు పోరాటం



గట్టు: ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ యర్రమోని యాదగిరి అన్నారు. మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు శుక్రవారం ఆలూరు నుంచి పాదయాత్రను ఆయన ప్రారంభించారు. ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం, 4న రాష్ట్ర రాజధానిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ రాజు, బల్గెర ఏసన్న, ఆలూరు రామకృష్ణ, విజయ్‌కుమార్, సత్తికుమార్, రవి, అంజన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు గురుకుల పాఠశాలలో ఇంటర్ విద్యార్థినులకు వైద్య పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 242 విద్యార్థినుల రక్తనమూనాలను సేకరించారు. అదేవిధంగా బీపీ, కంటి పరీక్షలు చేశారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవానందం , స్వాతి, గీత, మానవపాడు మండల వైద్యాధికారులు సవిత, రాఘవేంద్ర, మస్రత్, సాఫియా పాల్గొన్నారు.

రవన్న స్ఫూర్తితో పోరాడుతాం

గద్వాల అర్బన్: పేదల సమస్యలపై రవన్న స్ఫూర్తితో పోరాడుతామని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి చింతరేవుల కృష్ణ అన్నారు. శుక్రవారం రాయల సుభాష్ చంద్రబోస్ (రవన్న) ఏడో వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజలతో కలిసి పోరాటాలను నడిపించిన నాయకుడు రవన్న అని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు జమ్మిచేడు కార్తీక్, శివకుమార్, సురేష్, వెంకటేష్, గణేష్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ధరూరు: మండలంలోని చింతరేవుల మాజీ ఎంపీటీసీ హనుమంతు(70) గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న రమ్య ఇండస్ట్రీస్ అధినేత బండ్ల రాజశేఖరరెడ్డి శుక్రవారం గ్రామానికి చేరుకుని హనుమంతు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. అంతకుముందు బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రాజేష్ పరామర్శించి ఓదార్చారు.

ఉపాధి కూలీల నిరసన



గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఆలూరు గ్రామ కూలీలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి లేఖను పంపుతున్నట్లు తెలిపారు. లేబర్ యాక్టు ప్రకారం రోజు వారి కూలి చెల్లించాలని, ఉపాధి నిధులను తగ్గించడం ద్వారా గ్రామాల్లో పని దొరకడం లేదన్నారు. వేసవి అలవెన్స్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పని చేసిన 15 రోజుల్లో కూలి డబ్బులను చెల్లించాల్సి ఉండగా, 6 నెలలు గడుస్తున్నా రావడం లేదన్నారు. ఈ మేరకు కూలీలంతా సంతకాలు చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నట్లు తెలిపారు.

సావిత్రి బాయి జీవితం ఆదర్శం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 126వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి, రాజు, ఇక్బాల్, సుభాన్, ఉప్పేరు నర్సింహ, ఆనంద్, మన్యం తదితరులు ఉన్నారు.

అలంపూర్: సావిత్రి బాయి పూలే జీవితం మహిళలకు స్ఫూర్తిదాయకమని సావిత్రిబాయి పూలే అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో సావిత్రి బాయి 126వ వర్ధంతిని కేవీపీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళలకు 1848లోనే బలహీనవర్గాల, దళిత మహిళల కోసం పాఠశాలలను నెలకొల్పారని గుర్తు చేశారు. దేశ మొట్ట మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని కొనియాడారు. కార్యక్రమంలో అబ్దుల్ హాక్, వెంకటస్వామి, నాగరాజు, నరసింహ, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.



అలంపూర్‌లో నివాళులర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

మానవపాడు: మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, మండల అధ్యక్షుడు రాజు మాలిక్‌బాషా, మహబూబ్‌బాషా, రామాంజనేయులు, దుబ్బన్న, శాంతన్న, షాలు, తిక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో సావిత్రి బాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వివిధ సంఘాల, పార్టీల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి, మైనర్‌బాబు, ప్రభాకర్, రాజు, మహేష్, రాజు, ఆనంద్, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.



గద్వాలలో..



అయిజ పట్టణంలో..



మానవపాడులో..

పోలింగ్ ఏర్పాట్లు పరిశీలన



అయిజలో పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మి



మానవపాడులో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

మానవపాడు: ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ రమణారావు పరిశీలించారు. మహబూబ్‌నగర్–రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు, తాగునీటి సౌకర్యం, భారీకేడ్లు, కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, కార్యదర్శి మహేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయిజ: టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ స్టేషన్‌ను శుక్రవారం తహసీల్దార్ లక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ దుర్గాసింగ్ ఉన్నారు.

ధ్యానంతో సృజనాత్మకత శక్తి



అయిజ: ధ్యానంతో సృజనాత్మకత శక్తి పెరుగుతుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ జిల్లా ధ్యాన ప్రచార కర్తలు గుండం శైలజ, గుండం తిరుపతిలు అన్నారు. శుక్రవారం మండలంలోని కేశవరం, వేణిసోంపురం, చిన్న తాండ్రపాడు గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న అనేక వత్తిడిలను ధ్యాన సాధన దూరం చేసుకోవచ్చన్నారు. తలనొప్పి నుంచి క్యాన్సర్ వరకు వ్యాధులు తగ్గుతాయని, భవిష్యత్తులో రోగాలు రావన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందన్నారు. ధ్యానం ఉచితంగా నేర్పిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిన నాయకులు



తరలివెళ్తున్న టీజేఎస్ నాయకులు

గద్వాల అర్బన్: హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలో నిర్వహించిన తెలంగాణ బచావో సదస్సుకు జిల్లా టిజేఎస్ కన్వీనర్ అలూరు ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ఎందరో త్యాగాలు, సబ్బండ వర్గాల ప్రజల మద్దతుతో తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సదస్సుకు తరలివెళ్లిన వారిలో వీరభద్రప్ప, మహబూబ్ పాషా, రాజు, వీరేష్, ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’ పనుల పరిశీలన



మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ రమణారావు తనిఖీ చేశారు. అమరవాయి గ్రామంలో మొక్కలకు నీరు పోసి వివిధ పనులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. బిల్లుల విషయంలో అలసత్వం వహించొద్దని ఫీల్డ్ అసిస్టెంట్లను, కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కేంద్రాల సందర్శన



మల్దకల్: మండలంలోని తాటికుంట, మల్లెందొడ్డి గ్రామాల్లోని కంటి వెలుగు కేంద్రాలను శుక్రవారం ఎంపీడీఓ కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో డాక్టర్లు ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, స్వరూపరాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చల్లాను కలిసిన రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్



అలంపూర్: మాజీ ఎమ్మెల్యే చల్లావెంకట్రామిరెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన చల్లాను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం కోసం గొడవ

ఉండవెల్లి: అకారణంగా స్నేహితుడిపై దాడి చేసి గాయపరిచిన ఘటన శుక్రవారం మండల కేంద్రంలోని అలంపూర్ చౌరస్తా వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ బాల్‌రాజు వివరాల ప్రకారం కోనేరు గ్రామానికి చెందిన బిచ్చాల వెంకటేశ్వర్లు అతని స్నేహితులు సిద్దు, దేవరాజు, సుంకన్న, విష్ణు, స్నేహితులు పట్టణ చౌరస్తా వద్ద మద్యం తాగారు. ఇంకా మద్యం కోసం స్నేహితుల మధ్య గొడవకు దారితీసింది. ఈ క్రమంలో బిచ్చాల వెంకటేశ్వర్లును మిగతా మిత్రులు కలిసి దాడి చేసి గాయపరిచారు. ఈ విషయమై బాధితుడుతో పాటు మిగతా మిత్రులు నలుగురు వేర్వేరుగా ఫిర్యాదు చేశారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు పేర్కొన్నారు.

హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

గద్వాల అర్బన్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలయ్యారని, రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్, శేరెల్లి వీధుల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇల్లు లేని పేదవాడి ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థికసాయం అందిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని, పెరిగిన పెట్రోల్, డీజీల్, నిత్యావసర ధరలను తగ్గిస్తామన్నారు. ఈ యాత్రలో నాయకులు ఉమాదేవి, ఇసాక్, జమాల్, ఇలియాస్, కిఫాయత్, రాము, శివరాజ్, రమేష్, భీసన్న తదితరులు ఉన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులకు వస్తువుల వితరణ

అయిజ: మండలంలోని ఉప్పల ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డికి చెందిన పల్లె రంగారెడ్డి పాఠశాల విద్యార్థులకు రూ.10 విలువ చేసే పరీక్ష ప్యాడ్‌లు, కంపాక్స్ బాక్సులను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం రంగారెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం నరసింహులు, ఎస్ఎంసీ చైర్మన్ మాధవాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



దాత రంగారెడ్డితో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ముఖ్యమంత్రిగా శరత్, విద్యాశాఖ మంత్రిగా శ్రావణి, జిల్లా కలెక్టరుగా భవాని, డీఈఓగా నవీన్, ఎంఈఓగా రామ్‌చరణ్, ప్రధానోపాధ్యాయులుగా పావని, పీఈటీగా అశోక్, విష్ణు, ఉపాధ్యాయుల వేషధారణతో అలరించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీరభద్రప్ప, ఉపాధ్యాయులు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, రామదాసు, దస్తగిరి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం తగదు

శాంతినగర్: సమస్యల పరిష్కారానికి అధికారుల నిర్లక్ష్యం తగదని వడ్డేపల్లి ఎంపీపీ రజిత అన్నారు. శుక్రవారం వడ్డేపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి అధికారులు పూర్తి స్థాయిలో హాజరు కాలేదు. అధికారుల గైర్హజరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరైన అధికారులు కూడా ప్రజా ప్రతినిధులు సమస్యలను లేవనెత్తగా ఫోన్‌లు చూస్తూ పట్టనట్లుగా వ్యవహరించారు. హాజరైన అధికారులు వారి శాఖకు సంబంధించిన తాజా నివేదికలను చదివి వినిపించారు. ఆయా శాఖలకు చెందిన అధికారులను వివిధ సమస్యలపై సభ్యులు ప్రశ్నించారు. ముఖ్యంగా ఆర్డీఎస్ నీటి విషయమై సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. ఆయకట్టు కింద పంటలు ఎండిపోతున్నాయని ఆర్డీఎస్ అధికారులు స్పందించి వెంటనే నీటిని విడుదలచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఆర్డీఎస్ నీరు శాంతినగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి ప్రవేశిస్తుందని రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ నర్సింహులు కోరారు. రామాపురం పాఠశాలలో విద్యుత్ లైన్ మధ్యలో వెళ్లినందున అభివృద్ధి పనులకు ఆటంకంగా మారిందని స్తంభాలు సిఫ్ట్ చేయాలని సర్పంచ్ బీసన్నగౌడ్ కోరారు. అంతేగాక గత సమావేశాలకు ఆయా శాఖల అధికారులు గైర్హాజరైనా అలాంటి వారిపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సమావేశానికి ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. దీంతో సర్వసభ్య సమావేశం ఎలాంటి తీర్మాణాలు లేకుండానే తూతూ మంత్రంగా ముగిసింది. సమావేశంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రజిత

మొక్కలను సంరక్షించుకుందాం



మొక్కలకు నీరు పోయిస్తున్న కమిషనర్ నర్సయ్య

అయిజ: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు వేసవికాలంలో ఎండిపోకుండా సంరక్షించుకుందామని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య అన్నారు. హరిత శుక్రవారం కార్యక్రమంలో భాగంగా అవెన్యూ ప్లాంటేషన్, మున్సిపల్ నర్సరీలను ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవికాలంలో మొక్కలకు క్రమం తప్పకుండా నీళ్లు పోయాలని, ఏమొక్క కూడా ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, ఏఈ గోపాల్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. రోడ్డు నిర్మాణం పనులు నిబంధనల మేరకు సకాలంలో పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను కోరారు. నాణ్యత విషయంలో రాజీపడేదిలేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధన

మల్దకల్: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన బోధన అందించాలని మండల రిసోర్స్ పర్సన్ సీతమ్ నాయుడు, హరిప్రియలు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని నీలిపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో అమరవాయి హెచ్ఎం జానకమ్మ ఆధ్వర్యంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీతమ్ నాయుడు, హరిప్రియలు మాట్లాడుతూ అన్ని పాఠశాలలో ఉపాధ్యాయులు ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్, గణితం, సామాన్యశాస్త్రం సబ్జెక్టలలో సామర్థ్యాలు మెరుగుపడేవిధంగా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఈసీ కోఆర్డినేటర్ శేఖర్, సీఆర్పీ పద్మమ్మ, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధించాలి

ధరూరు: విద్యార్థులకు అర్థమయ్యే తరహాలో విద్యాబోధన అందించడంతో పాటు గుణాత్మక విద్యనందించాలని ఎంఈఓ నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మార్లబీడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని మండలంలోని జాంపల్లి పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డెమో క్లాసులు సీఆర్‌పీ బతుకన్న నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం వెంకటేశ్వరరెడ్డి, రీసోర్స్ పర్సన్లు షేక్షావలి, సంధ్యారాణి, శంకర్‌నేయిల్, మండల కో ఆర్డినేటర్ సునీత కుమారి, ఆయా పాఠశాలల హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీతమ్ నాయుడు

కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

అయిజ: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి ఉపాధ్యాయ సమస్యలపై అవగాహన ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బింగుదొడ్డిలో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల హామీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఇంటింటికి తిరిగి ఓటర్లను కలిసి ఏవీఎన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని మాచర్ల ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి మద్దతుగా బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: టీటీజేఏసీ బలపర్చిన పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కావలి అశోక్ కోరారు. శుక్రవారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి పదవ పటాలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటకం రమేష్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, ఆంజనేయులు, భాస్కర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కొంకల, తనగల, రామాపురం, శాంతినగర్, వడ్డేపల్లి కేజీబీవీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ నాయకులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. టీఎస్ యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిప్పన్న, జిల్లా కార్యదర్శులు బీసన్న, నాయకులు పాల్గొన్నారు.



అయిజలో కరపత్రాలను విడుదల చేస్తున్న రామచంద్రారెడ్డి

రైతులకు సబ్సిడీ గడ్డి విత్తనాలు

అయిజ: మండలంలో పాడి పశువులు కలిగిన రైతులకు ప్రభుత్వం 75 శాతం సబ్సిడీ ధరతో గడ్డి విత్తనాలు సరఫరా చేస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి స్వరూప రాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి గడ్డి విత్తనాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రంలోని పశువైద్యశాలలో అవసరమైన పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ భువనేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎస్ఎస్‌జీ, మైజ్ రకానికి చెందిన 1000 కేజీల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పాడి రైతులకు 75 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. పశుగ్రాస విత్తనాలు కావలసిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.